క్లుప్తంగా

దరఖాస్తు గడువు పెంచాలని వినతి

కల్వకుర్తి టౌన్: బీసీ కులవృత్తి వారికి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రూ.లక్ష రుణ దరఖాస్తు గడువును పెంచాలని కాంగ్రెస్ నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో వినతి అందజేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హరీందర్‌కు వినతి అందజేశారు. విజయ్‌కుమార్, అనిల్, శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లె నిద్ర

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మంగళవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

మర్రికి ఘన స్వాగతం

బిజినేపల్లి: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన అనంతరం తొలిసారి నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తిమ్మాజిపేట మండలంలోని మరికల్ వద్ద స్వాగతం పలికారు. డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, ఎంపీపీలు పాల్గొన్నారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి

కల్వకుర్తి టౌన్: ఆర్టీసీ సంస్థ ద్వారా అందిస్తున్న ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కల్వకుర్తి డిపో మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఆర్టీసీ కార్గో ప్రారంభమై 4 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో వారి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. బస్టాండ్‌లోని కార్గో కేంద్రం వద్ద అక్కడి ప్రయాణికులతో మాట్లాడి కార్గో సేవలను వారికి మేనేజర్ తెలియజేశారు. కల్వకుర్తి కార్గో ఎగ్జిక్యూటివ్ శ్రీధర్, డిపో సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేందర్

చారకొండ: మండలంలోని తుర్కలపల్లికి చెందిన డాక్టర్ జి.మహేందర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శిగా డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. అతను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ పొందారు. కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ.. పార్టీ బలోపేతానికి పని చేస్తున్న మహేందర్‌ను గుర్తించినట్లు చెప్పారు. పార్టీలో సముచిత స్థానం కల్పించి, బాధ్యతలు అప్పజెప్పినందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

రాగిజావ పంపిణీ



తాడూరు: విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేసిన రాగిజావను మండలంలోని అంతారం, అల్లాపూర్, మేడిపూర్, పాలుమూరు, గుట్టలపల్లి గ్రామాల్లో విద్యార్థులకు అందజేశారు. చినరాములు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభ వాయిదా

తాడూరు: మండల కేంద్రంలోని రచ్చకట్ట వద్ద మంగళవారం సర్పంచ్ యాదమ్మ అధ్యక్షతన నిర్వహించాల్సిన గ్రామసభ వాయిదా పడింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పవన్ మాట్లాడారు. గ్రామసభలో గందరగోళం నెలకొన్న దృష్ట్యా వార్డు సభ్యులు సకాలంలో రాకపోవడంతో వాయిదా వేశామని, తరువాతి తేదీ తెలియజేస్తామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఊర్కొండ: మండలలోని ఇప్పపహాడ్‌లో డ్రెయినేజీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిధులు రూ.10 లక్షలు, ఎంపీ మన్నెం శ్రీనివాస్ రెడ్డి నిధులు రూ.5 లక్షలతో ఇప్పపహాడ్‌లో అండర్ డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. సర్పంచ్ వనజ బాలస్వామి మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో మురుగు రోడ్లపై ప్రవహించకుండా డ్రెయినేజీ పనులు వెంటనే పూర్తి చేస్తున్నామన్నారు. మురుగు ఇళ్లమధ్య పారి దోమలు, రోగాలకు నిలయంగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ప్రశాంత్ రెడ్డి, కానుగుల లక్ష్మయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం దుకాణంలో ఏఓ సాయిరమేశ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పత్తి వరి విత్తనాలు వాటి ఇన్వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పాపగల్‌లోని శివట్రేడర్స్ షాపులో మొక్కజొన్న విత్తన నమూనాను సేకరించారు.



చదువుతో మంచి భవిష్యత్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

• పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాల్‌రాజ్ విద్యార్థులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉజ్వల భవిష్యత్తుకు చదువే మూలధనం

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో విద్యను అభ్యసించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సూచించారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు.

• విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, 'మన ఊరు- మన బడి' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. రూ.78 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి నిర్మాణ పనులను ప్రారంభించారు.

విద్యాభివృద్ధికి కృషి..

కొల్లాపూర్ నియోజకవర్గాన్ని విద్యారంగంలో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. విద్యాదినోత్సవంలో భాగంగా మంగళవారం ఆయన కొల్లాపూర్ పట్టణంలోని కేజీబీవీ పాఠశాల, మైనార్టీ, ఎస్సీ గురుకుల పాఠశాలలను సందర్శించారు. కేజీబీవీలో రూ.2.05 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.కోటి వ్యయంతో ఎస్సీ గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కేజీబీవీతో పాటు మైనార్టీ, ఎస్సీ గురుకుల పాఠశాలలో చదువుల్లో రాణిస్తున్న విద్యార్థినులను ఎమ్మెల్యే అభినందించారు. ఉపాధ్యాయురాళ్లకు ప్రశంసాపత్రాలు అందించారు.

పాఠశాల భవనం ప్రారంభం

కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిలలో విద్యా దినోత్సవం సందర్భంగా రూ.28 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతనంగా భవనాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రారంభించారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



సోమశిలలో పాఠశాల భవనం శిలాఫకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి



కల్వకుర్తిలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ



పెద్దకొత్తపల్లి కేజీబీవీ పాఠశాలలో..



చారకొండలో విద్యాదినోత్సవంలో విద్యార్థులు



పెంట్లవెల్లిలో పాఠ్యపుస్తకాల పంపిణీ



వెల్దండంలో విద్యార్థుల ర్యాలీ



తెలకపల్లిలో ర్యాలీ



ఉప్పునుంతల మండలం గట్టుకాడిపల్లిలో



కొండనాగులలో డిజిటల్ బోర్డు ప్రారంభం



కొల్లాపూర్‌లో..



లింగాల మండలం అంబట్‌పల్లిలో ర్యాలీ



కోడేరులో..



అమ్రాబాద్‌లో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు



మేడిపూర్‌లో కోలాటం వేస్తున్న విద్యార్థులు

ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి

వెల్దండ: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు ప్రతి గ్రామంలో కృషిచేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో సంయుక్త మోర్చాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆచారి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదప్రజల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దళిత మోర్చా, యువ మోర్చా, గిరిజన మోర్చా, మైనార్టీ మోర్చా, మహిళా మోర్చా ఏడు మోర్చాలకు చెందిన పార్టీ కార్యకర్తలు సంక్షేమ పథకాలను ఇంటింట ప్రచారం నిర్వహించాలన్నారు.

25న సభ విజయవంతం చేయాలి..

నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 25న నిర్వహించే బీజేపీ సమావేశానికి అన్ని గ్రామాల పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మోర్చాల వారికి పార్టీ కార్యకర్తలను సభకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షుడు హాజరవుతున్నట్లు వివరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి, కండె హరిప్రసాద్, పరమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



వెల్దండలో మాట్లాడుతున్న ఆచారి

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన

కొల్లాపూర్: పెండింగ్‌లోని ఉపాధి కూలీల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం కొల్లాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి భాస్కర్‌నాయక్ మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600 చెల్లించాలన్నారు. పనిదినాలను పెంచాలన్నారు. పని ప్రాంతాల్లో టెంట్లు, మంచినీళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ చెన్నమ్మకు అందజేశారు. శివవర్మ, తారాసింగ్, సేవ్యానాయక్, చంద్రునాయక్, బాబు తదితరులున్నారు.



ఎంపీడీఓకు వినతి అందజేస్తున్న నాయకులు

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

కందనూలు: యూనియన్ డేను పురస్కరించుకొని మంగళవారం మున్సిపల్ పరిధిలోని కొల్లాపూర్ చౌరస్తాలోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిర్‌లో ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ యూనియన్ నాయకులు మాట్లాడారు. తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి తారకనాథ్ వర్ధంతి పురస్కరించుకుని యూనియన్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతి ఆశ్రమంలో విద్యార్థులకు రూ.20 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్స్, బ్యాగులు ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు అందజేసినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం జూన్ 20న సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆకారపు విశ్వనాథం, బాలస్వామి, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల అరెస్టు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎల్‌హెచ్‌పీ నాయకులు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న గిరిజన నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడారు. గిరిజన బంధు అందించి నిరుద్యోగ గిరిజన యువతను ఆదుకోవాలన్నారు. అనంతరం అరెస్టయిన వారిని సాయంత్రం విడుదల చేశారు. నర్సింగ్‌నాయక్, రఘునాయక్, శ్రీను, రాహుల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

తొమ్మిది మంది..

ఉప్పునుంతల: లంబాడి హక్కుల పోరాట సమితి సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ప్రగతి భవన్ ముట్టడికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న తొమ్మిది మందిని మంగళవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలియజేశారు.

విమర్శలు చేయడం తగదు

కొల్లాపూర్: ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదని బీఆర్ఎస్ ఎస్సీసెల్ నాయకులు డీకే.మాదిగ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీతో పాటు కొంత మంది నాయకులు ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెంకటేష్, శ్రీనివాసులు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: ఇద్దరు వ్యక్తులు గొడవపడిన నేపథ్యంలో ఒకరిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఖాసిం అనే వ్యక్తి గ్యాస్ స్టవ్ రిపేర్ చేస్తుంటాడు. తన పనిలో భాగంగా మంగళవారం ఉదయాన్నే మండలంలోని రఘుపతిపేటకు వెళ్లి కల్వకుర్తికి తిరుగు ప్రయాణమయ్యాడు. తిరుగు ప్రయాణం క్రమంలో అదే గ్రామానికి చెందిన శ్రీను అతని భార్యతో కలిసి బైక్‌పై కల్వకుర్తికి వస్తున్నాడు. ఖాసీం, శ్రీనుకు గ్రామ పరిధిలో కొద్దిపాటి ఘర్షణ జరిగి గొడవ పెద్దదిగా కావటంతో శ్రీను ఖాసీంను అక్కడే ఉన్న రాయితో తలపై కొట్టాడు. ఖాసీంపై జరిగిన దాడితో కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ రమేష్ శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ఉప్పునుంతల: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారిణి స్వప్న మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మంది మహిళలకు క్యాన్సర్‌కు సంబంధించిన పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమున్న వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రభావతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

తెలకపల్లి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ హనుమంతురావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దపల్లిలో గ్రంథాలయాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. హనుమంతురావుతో పాటు ఎంపీపీ కొమ్ము మధు, సర్పంచ్ అనసూయ, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీటీసీ రమేశ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పాడి రైతులు

కల్వకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు రూ.4 ప్రోత్సాహకం అందిస్తామని ప్రకటించి అందించడంలేదని పాలశీతలీకరణ కేంద్రం అధ్యక్షుడు శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం పాడి రైతులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిశారు. 37 నెలలుగా రూ.4 ప్రోత్సాహకం రావడం లేదని విజయ దాణా సరఫరా కావడం లేదని, తమ సమస్యలు పరిష్కరించాలని వినతి అందజేశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో శేషరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నడ్డా సభకు సన్నాహక సమావేశం



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ పట్టణానికి ఈ నెల 25న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానుండటంతో ఆయన సభను విజయవంతం చేయడానికి మండల కేంద్రంలోని బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి సుబ్బారెడ్డి హాజరై జేపీ నడ్డా బహిరంగ సభకు జన సమీకరణపై చర్చించారు. బీజేపీ నాయకులు భూషయ్య, లక్ష్మణ్, చంద్రకళ, బాలస్వామి, కృష్ణ, వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో బీజేపీ దాడులను ఖండించాలి



కోడేరు: త్రిపుర రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, రైతులపై, సీపీఎం పార్టీ శ్రేణులపై తీవ్రంగా దాడులు చేస్తుందని, ఈ దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని డిమాండ్ చేస్తూ.. మండల కేంద్రం కోడేరులో మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టులు ఓట్లు వేయలేదని వారిపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. రమేష్, మాలిక్, బాలయ్య, పరుశరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను రెన్యూవల్ చేయాలి

కొల్లాపూర్: విద్యావలంటీర్లను రెన్యూవల్ చేయాలని విద్యావలంటీర్ల సంఘం జిల్లా నాయకులు పి.సురేష్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి విద్యావలంటీర్లుగా పనిచేసిన వారిని రాష్ట్ర ప్రభుత్వం విధులకు దూరంగా పెట్టడం బాధకరమన్నారు. ఉన్నత చదువులు చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్న వారు జీవనోపాధి కోసం విద్యావలంటీర్లుగా చేరారని, వారిని విధుల్లోకి చేర్చుకోకుండా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే విద్యావలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

మన్ననూర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న చెన్నకేశవులు(57) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బల్మూర్: మండలంలోని చెన్నారంలో యాదవులు నిర్మించతలపెట్టిన శ్రీపెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మంగళవారం భూమిపూజ చేశారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో అఖండ సంకీర్తన

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లికి చెందిన సీతారామాంజనేయ భజన మండలి సభ్యులు తిరుమల, తిరుపతి వేంకటేశ్వర స్వామి సన్నిధానంలో సోమ, మంగళవారంలో అఖండ హరినామా సంకీర్తనలో పాల్గొన్నారు. భజన మండలి అధ్యక్షుడు ఎన్.వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జంగయ్య, శ్రీశైలం, బాల్‌రాజు, చంద్రగౌడ్, రామకృష్ణ, నర్సింహ, కాశన్న, అశోక్ పాల్గొన్నారు.

దాతల సహకారం

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోషమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం జియగూడ యాదవ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ 50 సిమెంట్ బస్తాలను విరాళంగా అందజేశారు. నరేష్‌యాదవ్, వెంకటేష్, తానేష్ యాదవ్, మల్లేష్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

చారకొండ: మండలంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ రవికి చారకొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. భీముడు, బాల్‌రాం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జైపాల్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌కి చెందిన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. బైరాపూర్‌కి చెందిన జంగమ్మకు రూ.20 వేలు, రామచంద్రయ్యకు రూ.16 వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌ను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్: రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ కోరారు. మంగళవారం మండలంలోని జీడిపల్లి, ఎల్లికట్ట గ్రామాల్లో ఆన్‌లైన్ క్విజ్ పోటీల రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు.

దుస్తుల పంపిణీ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం తెలంగాణ జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు మిరియాల పావని దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 10 సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జరిగిన అభివృద్ధిని పావని విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఎస్‌ఓ రమాదేవి పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందించిన దుస్తులను, పాఠ్యపుస్తకాలను సర్పంచ్ నరేష్ నాయక్ అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, సుభాషిని, పద్మ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కల్వకుర్తి రూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. జీఓ 60 నంబర్ ప్రకారం కార్మికులకు క్యాటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి జూలై 5 నుంచి సమ్మె చేస్తామన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మహేష్, వెంకటయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభం



మన్ననూర్: పట్టణంలో లింగమయ్య కాలనీలో(చెంచు కాలనీ) నిర్మాణంలో ఉన్న లక్ష్మి నరసింహ స్వామి ఆలయం పునరుద్ధరణ పనులు చేపట్టారు. మంగళవారం వనవాసీ కళ్యాణ పరిషత్, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసే ప్రక్రియను ప్రారంభించారు. ధర్మ ప్రచార ప్రముఖ్ పరశురామ్, లింగయ్య, వెంకటరమణ, శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సులను తనిఖీ చేయాలి

కల్వకుర్తి రూరల్: ఎలాంటి ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిప్పుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా మండల అధ్యక్షుడు పరశురాం డిమాండ్ చేశారు. ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న బస్సులతో విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో శేఖర్‌రెడ్డి, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.